# "ఆగమాగమయిపోయింది గాదె"

గొల్ల గంగయ్య గొర్లగాసుకుంట బతుకుతడు. కొంచెమంత బూమిగూడుంది. ఓ కొడుకు రొండు బక్కాటితోనెవుసం జేత్తడు. వాళ్ళయ్య కాలంల గట్టిన ఎనిమిది గజేల పొడవు, ఐదు గజేల వెడల్పున్న పాత గూన పెంకలిల్లున్నది. అండ్లనే ఓ పక్క మైసమ్మ, ఓ పక్క పెద్దావెర, ఓ దిక్కు లచ్చిందేవి, ఉన్నొక్క అర్రలనేమో మల్లన్న దేవుడున్నడు. వెళ్ళినా వెళ్ళకున్నా యాడాదికోసారి మైసమ్మ, పెద్దావెరకు[9] యాటల్తోని జేత్తడు. మూడేండ్లకోమల్క మల్లన్న పట్నాలేత్తడు. మల్లన్న పట్నాలేసినప్పుడు మస్తు ఖర్సయితది. తన బిడ్డలకు తోడ బుట్టినోల్లకు కొత్త బట్టలు పెడుతడు. ఒగ్గొల్ల పిలిపిచ్చి పట్నాలేత్తరు. శివసత్తులు గజ్జెల్లాగులు తొడుక్కోని ఊదు, మైసాచ్చి పొగేత్తంటె శివం తూలుతరు. ఒగ్గొల్లు మల్లన్నకత, గంగదేవి కత జెప్పతరు. మైలల్దీసి అల్ల పిర్రలతోని ఇంటోల్లందరి మొకాలమీద రాత్రె గప్పుడన్ని పాపాలు పొయ్యి మంచిగుంటరని నమ్మిక.

ఆ యేడు గూడ గంగయ్య పట్నలేసుకున్నడు. ఆచారం ప్రకారం కులపోల్లందరిని పిలిసి భోజనం పెట్టాలె. బోజనానికని మానాయిన్నను పిల్సిండు. ఆయినె పానం మంచిగల్లేదని నన్ను పొయ్యన్నం తిని రమ్మన్నడు. నాయిన్న సెప్పిండని గంగయ్య మామింటికి పెయిన. అన్ని పనులు కొడుకులు, కోడండ్లు, బిడ్డలు గిట్ల సూసుకుంటంద్రు. కుప్పన పంచు ధోతి కట్టుకొని, కుప్పనపు రుమాలు చుట్టుకొని గంగయ్య మామ వాకిట్ల ఓ మూలకున్న నులుక మంచంల గొంగడేసుకోని అండ్ల కూసున్నడు. కుడిసేతికి బోలుగడెం,[10] పోంచి,[11] నడుముకు మొలపట్ట, చెవ్వుల చుట్టతోని నిండుగున్నడు. మందింక బోజనానికి రాలే. నన్ను జూసి "రా బిడ్డ రా. ఎప్పుడచ్చినవు కన్నాగురం నుంచి" అన్నడు.

"నిన్ననే వచ్చిన్నే మామ" అన్న నేను.

"మీ నాయిన్న నిన్ను దోలిండా బిడ్డ? మాగరిబోల్లింట్ల తింటవా నువ్వు? నువ్వేమో సదువుకున్నోనివైతివి?" అన్నడు.

"గట్లెందుకంటవే మామ? బువ్వ ఎవ్వలైద్దన ఒక్కటేనాయె. నేనెక్కడైన ఒక్కతీర్గనే తింట. గడుక మాల్లయిన, పరమాన్నమైన నాకొక్కటే" గంగుమామ పక్కపొంటి మంచంల కూసున్న.

"గట్లనే ఉండాలె బిడ్డ? నువ్వు గంత సదువుకున్నవు గని ముత్తెమంతన్న గర్ర లేదు నీకు. కొందరు పోరగాండ్లున్నరు. బూమ్మీన్నే ఆగరు. మిడిసిపడ్తరు.

"తీరు తీర్గ మనుషులంటరు గని మామ నీ మొకమంత సిన్నవోయిందేమె. నీ యవ్వ పట్నాలేత్తె కొడుకులకు ఖర్సయితందని బయపడ్తన్నావె" అన్న.

"గదేంగాదు కొడుక. కనంత ఆగమాగమయి పెయింది గాదల్లుడ"

"ఏమైందో సెప్పకపోతివి? నీ బిడ్డలు మంచిగనే ఉన్నరు గద?"

"ఏం మంచిగున్నరు కొడుక? పోరగాండ్లను కన్నం గానాల్లరాతలు గన్నమా? పెద్ద పోరికి పదకొండు నగలు (11 గొర్లు) అరణమిచ్చి లగ్గంజేసిన్నా. అయితేం సంబురమచ్చె. అవ్వి సాలయని పొర్ని రోజు గునిపిచ్చుడేనాయె. కొట్టుడు తిట్టుడేనాయె.[12] గానుగుల్దిగంటె దేపాయెనని మల్లనో ఐదు గొర్లిత్తి. అయినా దాని కంట్ల పోరు దప్పకపాయె" అనాగిండు.

నేనేం మాట్లాడలే.

"మొగపుట్టక పుట్టినంక మూతిమీన మీసమున్నోడయితె రోసం గలిగుండాలె. ఆడిదాని సొమ్ముతోని బతుకుతననుకునెటోడేం మొగోడు? మంది సొమ్ముల కాశెపడుతాడు? నీ యవ్వ మా కాలంలనే నయ్యం. నాకో బోలుగడెం, మొల్తాడిచ్చి లగ్గం జేసిండు. ఒక్క పోరన్న మీ అత్తనేం దెచ్చినవని అన్ననేమో అడుగు? నీ యక్క? కలీగమంత రోజు రోజుకీ నాశినికత్తంది" అన్నడు విచారంగ.

"గా బిడ్డ గురించే గింత బాద పడ్తున్నావె" అన్న.

"గదొక్కటయితె గింతగనం బాదెందుకుంటది కొడుక. కాని నాది బట్టురాత.[13] పెద్ద పోరి సంగతి గట్లుందా? దానెనుక పోరీరవ్వకు పదిగేన్నగలిచ్చి లగ్గం జేసిన్నా! గివ్వన్ని పెంపుజేసుకోని బతుకచ్చుగదగా లేకొడోడు. ఏం పన్జెయ్యక లుంగి గట్టుకొని టింగురంగాని తిర్గుతున్నడు. కూసుండి తింటె మన్నుకాడుంటయా? ఒక్కొక్కటమ్ముకొని అన్ని ఒడగాసిండు.[14] పోరి కైకిల్జేసుకుంట సంసారమెల్లదీత్తంది" గంగుమమ మొకం సిన్నవోయింది.

"మరాల్లకేమన్న సాయం జేత్తన్నావె"?

"ఒగలింటికిచ్చినంక ఎంతకని సాయం జేత్తంబిడ్డ. ఎవ్వలికాల్లు బతుకాలె గని! మల్ల నాకవ్వయ్య సంపాయిచ్చిన పదుల కొద్దెకరాల బూములు పడేదుత్తున్నయని సాయం జెయ్యన్నా సెప్పు. ఇంకోపోరి లగ్గానికుండె. మొగపోరగాండ్లిద్దరు గీ ఇంట్లనే నడుమ తడుకలు గట్టుకొని సంసారాల్జేత్తంద్రు. ఒకడెవుసం, ఒగడు గొర్లు జూసుకుంటంద్రు. ఇగ నాకు సాత గాకుంటయింది. ఎప్పుడన్నోపారి గొడ్లపొంటి పోతన్న. ఎంత జేసినా ఏం పాడైంది కొడుక. దుబ్బుందా?

"నీ యవ్వ నీ మాటలుగని గొర్లు యాదాడికో ఈతీనె. కొన్నయితె రొండీతలీనె. గిండ్ల ఆదాయం లేదానె?" అన్న నేను తెలిసుండి గూడ.

"నీ అసొంటి సదువుకున్నోల్లకు గంతే ఎరుక బిడ్డ? మీ అయ్యకయితె గిండ్లేముందో తెలుత్తది

సాదన వాట్నంటెంత కట్టపడన్నో నీకెట్ల తెలుత్తది కొడుక? గజ్జ గజ్జనుక్కుంట ఎంత సలిల్నయిన గొంగడి బొంతేసుకోని పండాలె. ముంత పోతాన గొట్టినా కట్టెమీదనే కునుకు దియ్యాలె. ఒక్కనాడన్న కంటినిండ కునుకుంటదా గొల్లోనికి? రాత్రిరంత పెండ్లాం పక్కల నిదురవెయిన గొల్లోన్ని సూపెట్టు నాకు. ఎంతెండల్నయిన కాలుకు బట్టగట్టకుంట వాటెంబడి తిరుగన్నాయె. అయుటి పూనంగ సిటుకరోగ మచ్చిందంటె బొంత పురుగులోలె ఏడియాడ రాలిపాయె. మంద బత్తెమంటత్తె మందమీద జేసుకున్న దేమళ్ళకే, తాగుళ్ళకే ఐపాయె. కులకసిపి నిడిసిపెడితె నల్లమొకమని గిది పట్టుకొనేడ్సుడు గని గిండ్లేమ్ఖుంది బిడ్డ?"

"ఎండ్లున్న కట్టాలండ్లున్నయే మామ".

"గది నువ్వద్దే గని బిడ్డ. నీ యక్క! గీ గొర్ల గాసుకుంట బతికెటోనంత ఈనం బతుకెవ్వలకుందో సెప్పు? అందరు అరితోరనే పిల్సిరి. మీదిమీది కురిపిచ్చిరి. గొల్లోడని పేర్నాలావట్టిరి.[15] మా బట్టగట్టుడు జూసి నవ్విరి. మందబత్తెమడిగితె కొట్టడొట్టచ్చిరి. ఇగిప్పుడు పంరపోగులు గూడ పట్టాల్జేసుకొని గొర్రెమాకె తిరుగ జాగలేకుంట జేసిరి. పొద్దుగాల్లేసి రాత్తిరిదాక తింపినా ఆటికడుపుల్నిండుత లేపాయె. నీ యవ్వ. ఇయ్యేడుయితె ఇంకితన్నాయెమైంది బిడ్డ. దేవునిగుల్లె మన్నువొయ్య. నా మీన్నే పగవట్టిండు. సిటుకు రోగమచ్చి సగం మంద జచ్చిపాయె. ఉన్నయి గూడంతెట్లనో ఉన్నయి.

పోనియ్యి ఎవుసంలనన్న ఓ తీరు గుంటదనుకుంటె మత్తడికిందొర్రె గొట్టి కార్జమసొంటి[16] పొలంల ఉసికెమేటలు పెట్టినయి. దాన్ని తోడిచ్చుటానికేగా మడిసెక్క దరకన్నెక్కో కర్నాయెట్టున్నది. బక్కెడ్లు సరిగ్గా నడుత్తలేవు, ముసలియైనయి. దెబ్బమీన దెబ్బ తలుగుతంది బిడ్డ. సరుకారు బాకోడు బాగ్గట్టుమని లోతీసిచ్చిండు. ఊళ్ళె కొనుటయినె అసలటెనుకగని మిత్తన్న ఇయ్యమంటడు. నీ యవ్వ? ఇయ్యేడు నా సంసారం సంగజ్జాత్తి మందమీద తోడేలు వడ్డట్టే ఉంది బిడ్డ. బతుకంత అగమాగమైపోతంది కొడుక" ఇంక చెప్పుతనే ఉన్నడు గంగుమామ.

"పండుగనాడు గూడ పాతమొగడేనని గియ్యాల్ల గూడ నీ సోదె . సెప్పుతన్నవా? గిదెప్పుడుండేదేనాయె" అని అచ్చినోల్లచ్చినట్టు తినిపోతండ్రు" అంటున్న అత్తమాటల్తోని ఆగొపెయిండు.

నేను లేచి అంపులకాడ[17] కాల్లు గడుక్కోని లోపలికి పెయిన. పరిసున్న గొంగడిమీన కూసున్న. ఇస్తరాకుల పెట్టిన మెతుకున బువ్వ. పెసర అనుపపప్పు కలిపి వేసిన పప్పు, కొత్తసింతకాయ పులుసుతోని అన్నం దిన్న. సాలినంక గూడ ఇంకంతేసి తినుమన్నరు. తిని మూతి తుడుసుకుంట గంగుమామకు సెప్పి ఇంటికచ్చిన. నాకెప్పుడు గంగుమామ కనవడ్డా ఆనాటి మాటలే సెవుల గిల్లుమంటయి. గొల్లోల బతుకులు కండ్లముందు తిరుగుతుంటయి.

☆ ☆ ☆